## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి రూరల్: మరమ్మతుల దృష్ట్యా చీమకుర్తి మండల పరిధిలోని మర్రిచెట్లపాలెం ఫ్యాక్టరీలకు, గృహ, గృహేతర వినియోగదారులకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### రేపు నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

ఒంగోలు సిటీ: నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మేయర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులంతా హాజరుకావాలని కోరారు. సమావేశం అజెండాలో ఒంగోలు నగరపాలక సంస్థ 2024–25 సంవత్సర సవరణ బడ్జెట్, 2025–26 సంవత్సర బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదం కోసం ఉంచనున్నట్లు మేయర్ తెలిపారు.

### అభయాంజనేయస్వామికి రజత నాగవల్లీదళ హారం



అభయాంజనేయస్వామికి హారం సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని మర్రిచెట్టుకాలనీ వద్ద ఉన్న పాలిమేర అభయాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి కావూరి గోపీచంద్, పద్మావతి దంపతులు పాతిక కిలోల వెండితో నూతన రజత నాగవల్లీదళ హారం (తమలపాకుల మాల)ను సోమవారం ఉదయం ఆలయ అర్చకుడు పరాంకుశ సమీర్‌కుమార్‌కు అందజేశారు. ముందుగా గోపీచంద్, పద్మావతి దంపతులు స్వామివారి దర్శనం చేసుకుని పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. దాతలతో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, వెండి తమలపాకుల మాల స్వపన శుద్ధిచేసిన అనంతరం అభయాంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకుడు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### బాలోత్సవంలో కనపర్తి విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

నాగులుప్పలపాడు : ప్రకాశం జిల్లా స్థాయి బాలోత్సవంలో మండలంలోని కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపి బహుమతులు గెలుపొందినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఒంగోలు పీవీఆర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రకాశం జిల్లా ద్వితీయ పండుగ కార్యక్రమంలో తమ పాఠశాలకు చెందిన కోమట్ల పూజా వైష్ణవి ఏకపాత్రాభినయం విభాగంలో తృతీయ బహుమతి, అక్కల శివకార్తీక వ్యాసరచన, చిత్రలేఖనం విభాగాల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు వివరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.


### గిరిజన మహిళలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

చీమకుర్తి: చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలపై ఈ నెల 14వ తేదీ దాడిచేసిన అదే గ్రామానికి చెందిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలులోని కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్స్‌సెల్స్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. బాధితులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో గిరిజన సంఘ నాయకుడు పేరం సత్యం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి రవి, ప్రజాసంఘాల నాయకులు ఇస్తర్ల శంకర్, చింతలపాలెం బాబు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

### పేద విద్యార్థులకు వసతులు కల్పించాలి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకర రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తరగతి గదుల్లో ఎఫ్ఎల్ఎస్ ప్యానల్ బిగించి ప్రభుత్వ విద్యార్థుల వలే సాంకేతిక విద్య అందించాలన్నారు. ప్రభుత్వ విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం, మంచినీటి వసతి కల్పించాలన్నారు. పేద విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని, ఎయిడెడ్ పాఠశాలలకు కూడా క్లీనింగ్ మెటీరియల్‌ను సర్వశిక్ష అభియాన్ అందించాలని కోరారు.

# మిషన్ తొక్కేశారు..!



- రెడీమేడ్ దుస్తులు, షాపింగ్ మాళ్లతో గ్రామీణ టైలర్లకు పనిలేకుండా పోతున్న వైనం
- ఉండటానికి, తినడానికి కూడా సరిపోని ఆదాయం
- ఆదుకోని కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న చేదోడు పథకంతో భరోసా
- సంతనూతలపాడు నియోజకవర్గంలో సుమారు 300 మందికిపైగా టైలర్లు

## దర్జా లేని దర్జీల జీవితాలు

సంతనూతలపాడు: మంచి దుస్తులతోనే మనిషికి అందం. సమాజంలో హుందాగా కనిపించాలంటే దుస్తులే ప్రధానం. అలాంటి వస్త్రాలను తీర్చిదిద్దేది దర్జీలే. గతంలో గ్రామాల్లో వీరికి ఎంతో డిమాండ్ ఉండేది. కాలక్రమంలో మార్కెట్లోకి పలు ఫ్యాషన్లు, డిజైన్లతో కూడిన రెడీమేడ్ దుస్తుల రాకతో ప్రస్తుతం గ్రామీణ టైలర్లకు ఉపాధి కరువైంది. కుల వృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. గతంలో పండుగలు, శుభకార్యాలు, ఇతర ఫంక్షన్ల సమయంలో టైలర్లకు చేతినిండా పని ఉండేది. కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల రాకతో టైలర్ల జీవితాలు అగమ్యగోచరంలోకి నెట్టివేయబడ్డాయి. వారి జీవితాల్లో దర్జా లేకుండా పోవడమే కాకుండా కనీసం నివాసం ఉండటానికి, తినడానికి కూడా ఇబ్బందిపడాల్సిన దుస్థితి నెలకొంది.

**తక్కువ సంఖ్యలో దుస్తులు కుట్టించుకుంటున్న ప్రజలు...**

నేటి యువతతో పాటు మధ్య వయసు వారు సైతం ఎక్కువగా టీషర్టులు, జీన్స్ ప్యాంట్లు ధరిస్తున్నారు. షాపింగ్ మాళ్లు ఆఫర్ల పేరుతో వల వేస్తుండటంతో ప్యాంట్లు, షర్టులు సైతం రెడీమేడ్‌వే కొనుగోలు చేస్తున్నారు. అతికొద్దిమంది మాత్రమే టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని టైలర్లకు పెద్దగా పని లేని పరిస్థితి. ఒకప్పుడు పండుగల సమయంలో ఇంటిల్లిపాదీ కొత్త దుస్తుల కోసం క్లాత్‌లు తెచ్చుకుని గ్రామాల్లోని టైలర్ల వద్ద కుట్టించుకునేవాళ్లు. తద్వారా ఆ సమయంలో టైలర్లకు అన్నం తినే సమయం కూడా ఉండేది కాదు. పండుగ ముగిసిన నెల రోజుల వరకు కూడా పని ఉండేది. కానీ, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

**ఆదుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...**

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం జగనన్న చేదోడు అనే పథకం అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. టైలర్లకు ఈ పథకం కొంతమేర వెసులుబాటు కల్పించింది. ప్రతి విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి కుట్టు కూలి డబ్బును తల్లుల ఖాతాలో జమచేస్తూ వచ్చింది. యూనిఫాం ప్రభుత్వం కుట్టించి ఇవ్వకుండా క్లాత్ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు చాలా వరకు పని లభించింది. ఒక రకంగా అప్పట్లో టైలర్లకు చాలా మేలు జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం గతంలో మాదిరిగా విద్యార్థులకు క్లాత్ ఇస్తే కొంతవరకైనా తమకు ఉపాధి లభిస్తుందని టైలర్లు అభిప్రాయపడుతున్నారు.

**సంతనూతలపాడు నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణం...**

నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లోని గ్రామాల్లో సుమారు 300 మందికిపైగా టైలర్లు ఉంటారు. ఈ నాలుగు మండలాలూ జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరాన్ని ఆనుకునే ఉండటంతో అరకొరగా క్లాత్‌లు కొని దుస్తులు కుట్టించుకునేవారు కూడా ఒంగోలు నగరంలోని టైలర్ షాపులకు వెళ్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాల్లోని టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకునేవారు లేక వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. టైలర్ షాపులన్నీ వెలవెలబోతున్నాయి. షాపునకు ఎవరొస్తారా అని ఎదురుచూసే పరిస్థితులు ఏర్పడ్డాయని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది దర్జీలు ఆయిల్ మిషన్లను పక్కకు పెట్టి అధునాతన విద్యుత్ మిషన్లు వాడుతున్నారు. పనులు సరిగ్గా లేక గది అద్దె, విద్యుత్ బిల్లులకు సరిపడా ఆదాయం కూడా రాక అవస్థపడుతున్నారు. కొందరైతే ఏకంగా టైలరింగ్ వృత్తిని వదిలేసి ఇతర పనులకు వెళ్తున్నారు.

**పనులు లేకుండా పోయాయి**

రెడీమేడ్ వస్త్రాల రాకతో మాకు పనులు లేకుండా పోయాయి. పండుగల సమయంలో కూడా పనులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఇంతకు ముందు పండుగల సమయంలో రాత్రింబవళ్లు పనిచేసేవాళ్లం. భవిష్యత్తులో ఈ వృత్తిలో కొనసాగడం కష్టతరంగా మారుతుంది. గత ప్రభుత్వంలో టైలర్లకు ఇచ్చిన రూ.10 వేలు ఎంతో ఉపయోగపడేవి. ఇప్పుడు అది కూడా రావడం లేదు.

– బండి సురేష్‌రెడ్డి, టైలర్, సంతనూతలపాడు

**టైలరింగ్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాం**

టైలరింగ్ పని మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. పనులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చాలా మంది రెడీమేడ్ దుస్తులు వాడటంతో కుట్టించుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. గతంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాం క్లాత్ ఇస్తే టైలర్లకు కొద్ది రోజుల పాటైనా పని దొరుకుతుంది.

– కరేటి చంద్రశేఖర్, టైలర్, సంతనూతలపాడు

# కూటమి కనికరం చూపడం లేదు

- మున్సిపల్ వర్కర్స్ కాలనీవాసులకు పట్టాలివ్వడం లేదు
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్లు

ఒంగోలు సిటీ: స్థానిక తూర్పుకమ్మపాలెం, ధారావారి కుంట 8వ డివిజన్ సర్వే నంబరు 23లో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న మున్సిపల్ వర్కర్స్ కాలనీవాసులకు పట్టాలివ్వాలని సీఐటీయూ నగర గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. సోమవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదన్నారు. క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు అక్కడే ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని నిర్ణయించి జీవో నంబర్ 30 జారీ చేసినా అమలు కావడం లేదన్నారు. ఈ జీవో ప్రకారం మున్సిపల్ వర్కర్స్ కాలనీకి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో అక్కడున్న కాలనీవాసులను ఐక్యం చేసి మరో పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ కాలనీలో మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పాములు, దోమలతో సహజీవనం సాగిస్తున్నారని, అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కాలనీవాసులు మోహన్‌రావు, బుట్టి రామయ్య, కాశయ్య, కోటమ్మ, మరియమ్మ, ఆదెమ్మ, మాధవరావు, అంజి, బాలకృష్ణ, ప్రభుదాస్, రవి, కోటేశ్వరరావు, వర్లబాబు, మోష, బుల్లెమ్మ, యాకోబు, ఏసు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# బూచేపల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సోమవారం చీమకుర్తిలోని వారి నివాసంలో మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించబడిన కూడల మాలకొండయ్య కలిసి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి తమకు కీలకమైన పార్టీ పదవి అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాలకొండయ్య తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి



జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

- జేసీకి జర్నలిస్టు సంఘాల నాయకుల వినతిపత్రం

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. మన్యం జిల్లాలో ప్రజాశక్తి విలేకరిపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్.వి.బ్రహ్మం మాట్లాడుతూ ప్రజాశక్తి విలేకరి రామారావుపై టీడీపీ మండల నాయకుడు దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాడన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి జర్నలిస్టులు వార్తా కథనాలు రాస్తుంటారని, అలాంటి వారిపై దాడులు జరగడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.భక్తవత్సలం, ప్రజాశక్తి జీఎం ప్రసాదరావు, జర్నలిస్టులు మీసాల శ్రీనివాస్, వి.నాగేశ్వరరావు, సువర్ణ రాజు, రాజు, కోటయ్య, సురేష్, కెమెరామెన్ శ్రీనివాసచారి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**ఏపీ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో...**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం (డీజేఎఫ్) సభ్యులు సోమవారం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఒంగోలులో శాశ్వత ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని కోరారు. డీజేఎఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నూకతోటి రవికుమార్, బొడ్డు శ్రీనివాసులు, ఎల్.రాజు, డిబ్బ అశోక్, సంజీవరావు, షేక్ నాసిర్, ప్రతాప్, అశోక్, బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.

# తలకు భారం కాదు.. భద్రత

- హెల్మెట్‌పై సంతనూతలపాడు ఎస్సై అజయ్‌కుమార్



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

సంతనూతలపాడు: హెల్మెట్ అనేది తలకు భారం కాదని.. భద్రత అని సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌కుమార్ అన్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం వలన కలిగే ఉపయోగాలు, వాడకపోతే కలిగే ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కొందరు హెల్మెట్ వాడకంపై నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. హెల్మెట్ ధరించాలని పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా చెవికి ఎక్కించుకోవడం లేదన్నారు. చివరకు ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాల్లో హెల్మెట్ లేక కొందరు ప్రాణాలు విడిచారని వివరించారు. చిన్నపాటి నిర్లక్ష్యం వారి కుటుంబాలను రోడ్డున పడేస్తోందని తెలిపారు. అందువలన జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణానికి ప్రమాదం తప్పుతుందన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌తో సహా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైసెన్సులు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

# బూచేపల్లి, చుండూరును కలిసిన చుంచు రామకృష్ణ



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న చుంచు రామకృష్ణ



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమితులైన చుంచు రామకృష్ణ సోమవారం చీమకుర్తిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణ వెంట పార్టీ రాష్ట్ర బీసీ నాయకుడు బొట్లా రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ సురేష్, జిల్లా నాయకులు తొట్టెంపూడి సురేష్, జిల్లా బీసీ నాయకులు కుట్టుబోయిన కోటి, ఫణిదపు సుధాకర్, సురేష్, ఉలిచి సర్పంచ్ మంచు మురళి, ఎంపీటీసీ పాలేటి శ్రీను, కరవది సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, కరవది ఎంపీటీసీ మన్నె శ్రీను, ఐటీ వింగ్ మహేష్, మదన్‌చక్రపాణి, శేషయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీల ధర్నా



మద్దిపాడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మద్దిపాడు: ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగనవాడీ వర్కర్లు, ఆయాల వేతనాలు పెంచాలని ధర్నాలు నిర్వహిస్తే.. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జనసేన, టీడీపీలు సంఘీభావం ప్రకటించాయన్నారు. ఇప్పుడు వారు అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26 వేలకు జీతాలు పెంచాలన్నారు. మినీ అంగన్‌వాడీలుగా ఉన్న వాటిని అంగన్‌వాడీలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమాదవశాత్తూ మరణిస్తే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జయప్రద, సీఐటీయూ నాయకురాలు ఆదిలక్ష్మి, నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి

మద్దిపాడు: మండలంలోని తెల్లబాడు గ్రామానికి చెందిన మహిళ మద్దిపాడు కొష్టాల సెంటర్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. తెల్లబాడు గ్రామానికి చెందిన సువార్తమ్మ (50) తన భర్త బొల్లెద్దు సుబ్బారావుతో కలిసి ఆదివారం సాయంత్రం పెద్దకొత్తపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కొష్టాల సెంటర్లో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్లే రోడ్డు మార్జిన్లో పెద్దకొత్తపల్లి డొంక రోడ్డువైపు వ్యతిరేక దిశలో టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా, గుంటూరు వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. దీంతో మోపెడ్‌పై వెళ్తున్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా ఒంగోలు రిమ్స్‌కు స్థానికులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సువార్తమ్మ ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మృతి చెందింది. మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసి మహిళ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

# భక్తిశ్రద్ధలతో శాంతి కళ్యాణోత్సవం



శాంతి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

చీమకుర్తి: చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వర స్వామి ఆలయంలో భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి 23వ శాంతి కళ్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను బస్టాండ్ సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. ఊరేగింపుగా సాక్షిరామలింగేశ్వస్వామి ఆలయం వద్దకు అత్యంత భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చి విశేష పూజలతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు సోమరాజుపల్లి కోటేశ్వరశర్మ, రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# సామాజిక సేవతోనే సంతృప్తి



బొమ్మరిల్లు అనాథాశ్రమంలో సరుకులు, విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: సమాజంలోని అట్టడుగు వర్గాలకు, అనాథలు, అభాగ్యులకు చేతనైనంత సాయం చేయడం ఎంతో తృప్తినిస్తుందని ఫ్యామిలీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు అన్నారు. తమ ఫ్యామిలీ క్లబ్ నిరంతర నిర్విరామ 40వ మాస సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం స్థానిక హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో 70 మంది అనాథ పిల్లలకు స్పోర్ట్స్ డ్రెస్లు పంపిణీ చేశారు. అల్పాహారం, పండ్లు అందించారు. ఆశ్రమంలో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అయిన ఎగ్జామ్ పాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అదే వేదికపై స్థానిక బలరాం కాలనీలోని ఉషోదయ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న పేద వృద్ధ మహిళలకు చీరలు, వృద్ధాశ్రమానికి నెలకి సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం గో సేవలో భాగంగా మడనూరులోని గోశాలకు పశువుల దాణా పంపించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు, పి.విజయ్‌కృష్ణ, శిఖాకొల్లి ఫణిరాజ్, తాళ్లూరి శ్రీను, టి.పాండురంగారావు, బైసాని శ్రీనివాసరావు, బీవీకే రమేష్, కే చంద్రమౌళి, నూకల వేంకటేశ్వరగుప్తా, తుమ్మపూడి సత్యనారాయణ, ఆర్ఎస్ ఫ్యాషన్స్ శ్రీనివాసరావు, బొమ్మరిల్లు నిర్వాహకులు పాల్గొన్నారు.